క్లుప్తంగా

గంగాలమ్మతల్లి గుడి నిర్మాణానికి విరాళం



గంగాలమ్మతల్లి గుడి నిర్మాణానికి రూ.10359 విరాళం అందజేస్తున్న కనకరామ్ దంపతులు

మునగపాక : మూలపేట గంగాలమ్మతల్లి గుడి నిర్మాణానికి దాతలు ముందుకొస్తున్నారు. ఆలయం శిథిలావస్థకు గురికావడంతో పెద్దలంతా నూతనంగా ఆలయం నిర్మించేందుకు శ్రీకారం చుట్టారు. ఈ మేరకు గురువారం ఆలయ నిర్మాణానికి గాను పాటిపల్లికి చెందిన రాపేటి కనకరామ్, సత్య దంపతులు రూ.10359 నగదును విరాళంగా కమిటీ సభ్యులకు అందజేశారు. దాతలు ఆలయ అభివృద్ధికి సహకరించాలని నిర్వాహకులు కోరుతున్నారు.

వంట పాత్రల పంపిణీ



కె.వెంకటాపురం హైస్కూల్లో వంట పాత్రలు అందిస్తున్న పాఠశాల సిబ్బంది

కోటవురట్ల : విద్యార్థులకు పోషకాహారాన్ని అందించాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని, అందుకు తగ్గట్టు మధ్యాహ్న భోజనం తయారీలో నాణ్యతను పాటించాలని హెచ్ఎం షేక్ అల్లా వుద్దీన్ అన్నారు. కె.వెంకటాపురంలోని జెడ్పీ హైస్కూల్లో జగనన్న గోరుముద్ద వంట నిర్వాహకులకు గురువారం వంట పాత్రలు పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటే పోషకాలతో కూడిన జగనన్న గోరుముద్ద అందుతోందన్నారు. విద్యార్థుల పట్ల ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందన్నారు. పేరెంట్స్ కమిటీ చైర్మన్ నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమస్యల శాశ్వత పరిష్కారానికి ప్రభుత్వం కృషి



వమ్మవరంలో రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే గొల్ల బాబూరావు

ఎస్.రాయవరం: గ్రామాల్లో సమస్యల శాశ్వత పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తోందని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. వమ్మవరం గ్రామంలో నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాల అమలుకు సరైన వసతి ఏర్పాటు చేశారని, సచివాలయాలు, రైతు భరోసా, వెల్‌నెస్ కేంద్రాలు ఏర్పాటు చేసి శాశ్వత సంక్షేమానికి పునాదులు వేశారన్నారు. అనంతరం గ్రామంలో ఏపీకి జగనే ఎందుకు కావాలి అనే కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామంలో అమలైన సంక్షేమ పథకాల వివరాలతో ఫ్లెక్సీని ఆవిష్కరించారు. ఆయా కార్యక్రమాల్లో సర్పంచ్ పాపారావు, ఎంపీటీసీ సూరిబాబు, పెనుగొల్లు పీఏసీఎస్ చైర్పర్సన్ హనుమంతరావు, జేసీఎస్ కన్వీనర్ సందీప్, మండల వ్యవసాయాధికారి సౌజన్య, ఎంపీడీవో రామచంద్రమూర్తి, కార్యదర్శి సత్యనారాయణ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తల నిరసన



మోకాళ్లపై నిలుచుని నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

మునగపాక : తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం మునగపాకలో అంగన్‌వాడీ కార్యకర్తలు మోకాళ్లపై నిల్చుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ నేత ఎస్.బ్రహ్మాజీ మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలకు కనీస వేతనం అమలు చేయాలని కోరారు. అలాగే మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని, వైఎస్సార్ సంపూర్ణ పోషణ మెనూ ఛార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కె.ఎ.ఎస్ జయలక్ష్మి, కె.రామలక్ష్మి, బి.తులసీలక్ష్మి, అంజలి, అరుణ, బాలగౌరమ్మ, శ్రావణి, వెంకటలక్ష్మి, దేవి పాల్గొన్నారు.

అందంగా...ఆహ్లాదంగా..

దుర్గంధం వీడి పార్కులను తలపించేలా

రూ 1.0.కోటితో చెరువుల అభివృద్ధి

వాకింగ్ ట్రాక్‌లు, ఓపెన్ జిమ్‌లు ఆట వస్తువులు ఏర్పాటు

పట్టణంలో చెరువుల ఆధునికీకరణకు చర్యలు

శరవేగంగా అభివృద్ధి పనులు

కొమ్మాయి గుండం చెరువు వద్ద జరుగుతున్న పనులు





అందంగా తీర్చిదిద్దుతున్న సన్యాసమ్మ చెరువు



ఇది కదా అభివృద్ధి

యలమంచిలి : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అభివృద్ధి పనులతో పాటు ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. గత టీడీపీ ప్రభుత్వం హయాంలో పట్టణంలో అభివృద్ధి కుంటుపడింది. కనీసం ఒక పార్కు గాని చెరువుల అభివృద్ధి గాని చేపట్టలేదు. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత పట్టణాల్లో అవసరమైన ప్రాంతాల్లో పార్కులు, చెరువుల అభివృద్ధికి పెద్ద పీట వేశారు. యలమంచిలి మున్సిపాలిటీ, పట్టణంలో రూ.కోటి రూపాయలతో కొమ్మాయి గుండం చెరువు," పట్టణంలో త్రిమూర్తులస్వామి ఆలయం వద్ద ఉన్న సన్యాసమ్మ చెరువు, పాత పెంకుల ఫ్యాక్టరీ వద్ద ఉన్న చెరువు, సెయింట్ జూడ్స్ స్కూల్ వద్ద ఉన్న చెరువును సుందరంగా తీర్చిదిద్దడానికి చర్యలు చేపట్టారు. పనులు చకచక జరుగుతున్నాయి, చెరువుల చుట్టూ వాకింగ్ ట్రాక్, రూ.12 లక్షలతో నిరుపయోగంగా ఉన్న జిమ్ పరికరాలు కనుగోలుతో ఓపెన్ జిమ్‌లు, పచ్చదనంతో కూడిన చెట్లు, వివిధ రకాల విద్యుద్దీపాలంకరణలు, స్థానికులకు ఆనందాన్ని ఆహ్లాదాన్ని తీసుకొచ్చారు. చాలా ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోని చెరువులు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో అమృత్ 2లో భాగంగా ఆంధ్రప్రదేశ్ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ ఆధ్వర్యంలో ఆరోగ్యకర పరిసరాలుగా అభివృద్ధి పరచడం పట్ల పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో అన్ని గ్రామాల్లో ఉన్న 31 చెరువులను ఉపాధి హామీ పథకంలో భాగంగా అభివృద్ధి చేస్తున్నారు. యలమంచిలి పట్టణంలో ఉన్న ప్రధాన పంట కాలువ, పులపర్తి గ్రామంలో ఉన్న ప్రధాన కాలువలల్లో పూడికతీత పనులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని త్వరలోనే పనులు ప్రారంభిస్తామని నీటి పారుదల శాఖ అధికారులు తెలిపారు. ఒకప్పుడు చుట్టూ చెత్తా చెదారంతో దుర్గంధం వెదజల్లుతూ మురుగు కూపాలుగా ఉండే చెరువులు ప్రస్తుతం ఆహ్లాదకర వాతావరణం ఉండేలా తీర్చి దిద్దడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

చెరువుల అభివృద్ధి పనులు ఇలా..

1) సైట్ క్లీనింగ్, లెవెల్ గ్రేడింగ్
2) చెరువులో పూడికతీత
3) మోడ్రన్ లైటింగ్
4) ఓపెన్ జిమ్‌లు
5)ఆట వస్తువులు
6) వాటర్ ప్యూరిఫికేషన్
7) ఆహ్లాదకరమైన చెట్లు
8) చెరువు చుట్టూ రివిట్‌మెంట్ వాల్
9) తాగునీరు,కుళాయిలు,
10) గేట్లు
11) గ్రీనరీతో కూడిన గడ్డి
12) దేశ నాయకులు, స్వాతంత్య్ర సమరయోధుల చిత్రపటాలు ఏర్పాటు
13)మరుగుదొడ్ల సదుపాయం

ప్రజలకు ఆరోగ్యం, ఆహ్లాదం కోసమే...



యలమంచిలి పట్టణంలో ఉన్న చెరువులను అభివృద్ధి చేయడం ద్వారా ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పడనుంది. మున్సిపాలిటీగా అభివృద్ధి చెందిన పట్టణంలో మహిళలు, సీనియర్ సిటిజన్స్, ప్రజలు ఉదయం, సాయంకాలం సమయాల్లో ఎక్కడైన సేద తీరాలంటే ఖాళీ స్థలాలు సరైన పార్కులు అందుబాటులో లేక ఇబ్బందులు పడుతుండేవారు. ప్రజల ఆరోగ్యం దృష్ట్యా శారీరక వ్యాయామం కోసం పట్టణంలో అసంపూర్తిగా ఉన్న చెరువులను అభివృద్ధి చేసి వాటిలో వాకింగ్ ట్రాక్, ఆటవస్తువులు, ఆహ్లాదకరమైన చెట్లు, కూర్చోవడానికి బల్లలు ఏర్పాటు చేయడం ద్వారా ప్రజలు సేదతీరడానికి వీలు కలుగుతుంది.

– యు.వి.రమణమూర్తిరాజు (కన్నబాబు) యలమంచిలి ఎమ్మెల్యే

వాకింగ్ ట్రాక్‌తో ఆరోగ్యం



యలమంచిలి పట్టణంలో యువతీ యువకులు ప్రతి రోజు శారీరక వ్యాయామం కొరకు స్థానిక రైల్వేస్టేషన్ ఫ్లాట్ ఫారమ్‌పై, సైతారుపేట రోడ్డులో రన్నింగ్, వాకింగ్ చేస్తూ ఉంటారు. పట్టణంలో వ్యాయామానికి సరైన స్థలాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్న సమయంలో కొమ్మాయిగుండం చెరువు, త్రిమూర్తులు స్వామి గుడి వద్ద ఉన్న చెరువును ప్రభుత్వం అభివృద్ధి చేసి వసతులు కల్పించడం ఎంతో ఉపయుక్తంగా ఉంది. మంచి వాతావరణం వల్ల ప్రజలకు మంచి గాలి, ఆరోగ్యం లభిస్తుంది.

–గొలుసుపూడి శ్రీనివాస్ (బుజ్జి), వ్యాపారి, యలమంచిలి

పిల్లలకు ఆటవిడుపు



పట్టణంలో చెరువులను అందంగా తీర్చిదిద్దడంతో పాటు జారుడు బల్లలు, వివిధ ఆట వస్తువులు ఏర్పాటు చేయడం ద్వారా పిల్లలకు ఆడుకోవడానికి వీలుగా ఉంది. గతంలో పిల్లలు ఆడుకోవాలంటే రోడ్లు దాటుకుని పంట పొలాల్లో ఎక్కడో మారుమూల ప్రాంతో ఆడుకునేవారు. ఇప్పుడు పట్టణంలో చెరువుల వద్ద ఉదయం సాయంత్రం సమయాల్లో పిల్లలతో పాటు మేము కూడా సేద తీరడానికి ఎంతో బాగుంది. ఒకప్పుడు దుర్గంధంతో నిండి ఉండే చెరువును అభివృద్ధి చేయడంతో ఎంతో ఆహ్లాదంగా మారింది.

– వల్లా రోహిణీదేవి, ఎన్‌టీఆర్ కాలనీ, యలమంచిలి

ఓపెన్ జిమ్‌లు భేష్



పట్టణంలో చెరువులను ప్రభుత్వం అభివృద్ధి పరచడం, వాటి వద్ద ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేయడం ద్వారా యువతకు ఎంతో ఉపయోగం కలుగుతుంది. అలాగే వాకింగ్ ట్రాక్ నిర్మాణం కూడా పట్టణ ప్రజలకు శారీరక వ్యాయామానికి వీలు కల్పిస్తుంది. గతంలో ఏ ప్రభుత్వం చేయలేని విధంగా ఈ ప్రభుత్వంలో పాడుబడిన చెరువులను శుద్ధి చేసి వాటిని ఆరోగ్య ప్రాంగణాలుగా మార్చడం అభినందనీయం.

– పి.సతీష్, యలమంచిలి

జగనన్న ప్రభుత్వంలోనే చెరువులకు మోక్షం



యలమంచిలి పట్టణంలో చెరువుల అభివృద్ధి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలోనే చూస్తున్నాం. గతంలో ఏ ప్రభుత్వం ఇటువంటి మంచి ఆలోచన చేయలేదు. అపరిశుభ్రంగా ఉన్న చెరువులను అందమైన పార్కులుగా తీర్చిదిద్దడం అభినందనీయం. ఎమ్మెల్యే రమణమూర్తిరాజు సహకారంతో పట్టణంలో అన్ని విధాలుగా అభివృద్ధి జరుగుతుంది.

– గంధం శివ, యలమంచిలి

జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం కావడం తథ్యం

మునగపాక : రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు కోరారు. ఉమ్మలాడలో గురువారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా ఇంతవరకు ప్రభుత్వం ద్వారా అందిన లబ్ధికి సంబంధించిన డిస్‌ప్లేను ఆయన ఆవిష్కరించారు. గత ప్రభుత్వానికి, నేటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి మధ్య తేడాను గుర్తించి వచ్చే ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డిని సీఎంగా గెలిపించుకోవాలన్నారు. సర్పంచ్ సూరిశెట్టి గంగయమ్మ, ఎంపీపీ జయలక్ష్మి, జెడ్పీటీసీ పెంటకోట స్వామి సత్యనారాయణ, సచివాలయాల మండల కన్వీనర్ గణేష్, ఎంపీటీసీ కృష్ణవేణి, గ్రామశాఖ అధ్యక్షుడు శ్రీనివాసరావు, వర్కింగ్ కమిటీ అధ్యక్షులు రామకృష్ణ, విజయకుమార్ పాల్గొన్నారు. గ్రామ కూడలిలో పార్టీ జెండాను పార్టీ మండల కన్వీనర్ అచ్చియ్యనాయుడు ఆవిష్కరించారు.



ప్రభుత్వ పథకాల లబ్ధి డిస్‌ప్లేను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అచ్చియ్యనాయుడు

నేడు గణపర్తిలో...

గణపర్తి గ్రామంలో శుక్రవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం జరుగుతుందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు తెలిపారు. సచివాలయ ప్రాంగణంలో మధ్యాహ్నం 3 గంటలకు ఇంతవరకు ప్రభుత్వం ద్వారా గ్రామ ప్రజలకు అందిన లబ్ధికి సంబంధించి డిస్‌ప్లే ఆవిష్కరణ ఉంటుందన్నారు.

ఘనంగా దార్లపూడి మరిడిమాంబ జాతర



మరిడిమాంబను దర్శించుకుంటున్న భక్తులు



అరబుపాలెంలో మరిడిమాంబ అమ్మవారిని దర్శించుకుంటున్న బొడ్డేడ ప్రసాద్

ఎస్.రాయవరం : దార్లపూడి మరిడిమాంబ జాతర గురువారం ఘనంగా నిర్వహించారు. గత వారం తుపాను కారణంగా వాయిదా పడిన ఉత్సవం గురువారం ఘనంగా జరిగింది. వేకువ జాము నుంచి అమ్మవారికి పసుపు కుంకుమలు, చీర సారెలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం అమ్మవారి ఆలయ ప్రాంగణంలో భారీ మందుగుండు సామాగ్రిని వెలిగించారు. ఈ జాతరను పురస్కరించుకుని పురవీధుల్లో విద్యుత్ సెట్టింగ్‌లు ఆకర్షణీయంగా అమర్చారు.

మునగపాక: మండలంలోని అరబుపాలెం గ్రామంలో గురువారం మరిడిమాంబ అమ్మవారి పండుగ ఘనంగా జరిగింది. ఉదయం నుంచి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు. వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, వ్యవసాయ మండలి జిల్లా చైర్మన్ చిక్కాల రామారావు, మాజీ ఎంపీపీ దాసరి గౌరీలక్ష్మి అప్పారావు, సర్పంచ్‌లు బొడ్డేడ శ్రీనివాసరావు,భీశెట్టి గంగప్పలనాయుడు, రవీంద్రరాజు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

గ్రామీణ క్రీడాకారులకు ఉపయుక్తంగా ఆడుదాం ఆంధ్రా

కోటఉరట్ల : గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న క్రీడా ప్రతిభను వెలికి తీసేందుకు ఆడుదాం ఆంధ్రా... కార్యక్రమం ఎంతగానో దోహదపడుతోందని ఎంపీపీ సింగంపల్లి అప్పలనాయుడు అన్నారు. బోడపాలెం గ్రామ సచివాలయంలో క్రీడా పరికరాలను గురువారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మాట్లాడుతూ మట్టిలో మాణిక్యాలను గుర్తించి జాతీయ స్థాయిలో రాణించేలా రాష్ట్ర ప్రభుత్వం సహకారం అందిస్తోందన్నారు. ఎంపీడీవో కాశీ విశ్వనాథం మాట్లాడుతూ మండలంలోని 19 గ్రామ సచివాలయాలకు సంబంధించి క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్ స్పోర్ట్స్ కిట్స్ వచ్చాయని వీటిని అన్ని సచివాలయాలకు అందించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సింగంపల్లి ఎరుకునాయుడు, సచివాలయ సిబ్బంది, కార్యదర్శులు వలంటీర్లు పాల్గొన్నారు.

నృసింహుని సన్నిధిలో విశేష హోమాలు



వెండి కవచ అలంకరణలో స్వామివారు

అనకాపల్లిటౌన్: స్థానిక గవరపాలెం దిబ్బవీధి వరాహలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో రెండోరోజైన గురువారం లక్ష్మీగణపతి, లక్ష్మీనృసింహస్వామి హోమాలను సింహాచలం దేవస్థానం పూర్వ ప్రధాన అర్చకులు గొడపర్తి గోపాలకృష్ణాచార్యులు, బంకుపల్లి శ్రీరాములాచార్యుల ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధల నడుమ జరిపారు. హోమ కార్యక్రమాలను వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకుడు దాడి రత్నాకర్, అచ్యుత దంపతులు నిర్వహించారు. తొలుత స్వామి వారికి స్వర్ణ సంపెంగ పుష్పార్చన నేత్రపర్వంగా జరిగింది. వెండి కవచడంతో లక్ష్మీనృసింహస్వామి, వెండి చీరలో లక్ష్మీ ఆండాళ్ తల్లి భక్తులకు దర్శనమిచ్చారు. విశేష హోమాలు, పూజలు తిలకించేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. ఆలయానికి స్వర్ణ సంపెంగలు, వెండి గదను రత్నాకర్ దంపతులు విరాళంగా అందించారు. వ్యాపారవేత్త కాండ్రేగుల శ్రీరామ్ ఆర్థిక సాయంతో ఏర్పాటు చేసిన ఈశాన్య సింహ ద్వారంతోపాటు, మధ్యాహ్నం భారీ అన్న సమారాధన ప్రారంభించారు. కార్యక్రమంలో 80వ వార్డు కార్పొరేటర్ కొణతాల నీలిమ, భాస్కర్ దంపతులు, మాజీ కౌన్సిలర్ పెతకంశెట్టి జగన్మోహనరావు, ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంతోనే అభివృద్ధి



ఉమ్మలాడలో కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎంపీపీ జయలక్ష్మి

మునగపాక : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకే గ్రామాల్లో అభివృద్ధి జరుగుతుందని ఎంపీపీ మళ్ల జయలక్ష్మి అన్నారు. మండలంలోని ఉమ్మలాడలో రూ.5లక్షలతో నిర్మిస్తున్న కాపుల కమ్యూనిటీ హాల్ పనులను ఆమె గురువారం పరిశీలించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ఒకవైపు సంక్షేమ పథకాలు మరోవైపు అభివృద్ధి చురుగ్గా జరుగుతుందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో ప్రభుత్వం పనిచేస్తుందన్నారు.

భక్తిశ్రద్ధలతో మార్గశిర మాసోత్సవాలు



మార్గశిర మాసోత్సవ పూజలందుకున్న కనకమహాలక్ష్మి అమ్మవారు

కోటవురట్ల: మండలంలో మార్గశిర మాసోత్సవాలను గురువారం భక్తిశ్రద్ధలతో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయాలు భక్తులతో కోలాహలంగా మారాయి. వేకువ జాము నుంచి ఆలయాలకు చేరుకున్న భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కై లాస పట్నంలోని రాజగోపాల స్వామి ఆలయం, చినలింగాపురంలోని దుర్గామల్లేశ్వర అయ్యప్ప ఆలయం, కోటవురట్లలోని ఉమాసహిత రామలింగేశ్వరస్వామి, సాయినగర్‌లోని సాయిబాబా, వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

ఎస్.రాయవరం : కర్రివానిపాలెం గ్రామంలో కనకమహాలక్ష్మి అమ్మవారు ఆలయంలో మార్గశిర మాసోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభం అయ్యాయి. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు తూము బుచ్చిబాబు సహకారంతో ఉత్సవ కమిటీ సభ్యులు అన్న సమారాధన నిర్వహించారు.

ఈవీఎంలపై ఓటర్లకు అవగాహన

అనకాపల్లిటౌన్: రానున్న సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈవీఎం ఓటింగ్‌పై ప్రజలకు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఆర్డీవో ఏజే చిన్నికృష్ణ తెలిపారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో వివిధ పనులపై కార్యాలయానికి వచ్చే ప్రజలకు ఈవీఎంల పనితీరు, ఓటు వేసే విధానంపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో తమ సిబ్బంది ఈవీఎం ఓటింగ్‌పై ప్రజలకు వివరిస్తారని తెలిపారు. ఓటర్ తమకు కావలసిన బటన్‌పై నొక్కిన వెంటనే ప్రక్కనే ఉన్న వీవీ ప్యాట్‌లో ఏ గుర్తుకు ఓటువేశారో చూసుకోవచ్చన్నారు. అంతకుముందు మండలంలోని కొత్తూరు, తుమ్మపాల గ్రామాల్లో ఈవీఎంలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

రాజకీయ పార్టీల నేతలతో భేటీ : వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో 18 ఏళ్ల నిండిన ప్రతి వ్యక్తి ఓటర్‌గా నమోదు చేసుకోవాలని ఆర్డీవో చిన్నికృష్ణ కోరారు. గురువారం తన కార్యాలయంలో టీడీపీ, ఆ ప్, బీఎస్పీ నేతలతో సమావేశం నిర్వహించారు. డివిజన్ పరిధిలో ఓటరు జాబితాలో మార్పులు చేర్పులు ఉన్నట్లయితే తక్షణమే బీఎల్వోలకు తెలపాలన్నారు. దొంగ ఓట్లు, ఒకే వ్యక్తికి రెండుచోట్ల ఓట్లు ఉన్నట్లయితే తక్షణమే తొలగించేందుకు సహకరించాల్సిందిగా కోరారు. అనంతరం వివిధ పార్టీల నేతలు మా ట్లాడుతూ పోలింగ్ బూత్‌లలో మౌలిక సదుపాయలు, వృద్ధులు కూర్చునేందుకు కుర్చీలు ఏర్పాటు చేయాలని అడిగిన ప్రశ్నలను ఆయన నివృత్తి చేశారు.

దళారులకు తావులేని సంక్షేమ పాలన



నునపర్తిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు

అచ్యుతాపురం(అనకాపల్లి) : అచ్యుతాపురం మండలంలోని నునపర్తి సచివాలయం పరిధిలో ఇప్పటి వరకూ ఈ ప్రభుత్వంలో కోటి 98 లక్షల రూపాయల నిధులు కేటాయించామని ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు (కన్నబాబు) అన్నారు. మండలంలోని నునపర్తి సచివాలయంలో గురువారం నిర్వహించిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా స్థానికులతో మాట్లాడారు. సంక్షేమ పథకాల అమలు, చేరవేత విషయంలో ఎటువంటి దళారులు లేకుండా అన్ని వర్గాలకు న్యాయం చేస్తుంది. ఈ ప్రభుత్వమే అని అన్నారు. ఈ సందర్భంగా సంక్షేమ బోర్డును ఆవిష్కరించారు. వైఎస్సార్ విగ్రహం వద్ద జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం నూతనంగా నిర్మించిన పశు వైద్యశాలను ప్రారంభించారు. మండల వైఎస్సార్‌సీపీ నాయకులు దేశంశెట్టి శంకర్‌రావు, కోన బుజ్జి, కోఆప్షన్ జెడ్పీ సభ్యుడు నర్మాల కుమార్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి పిన్నమరాజు వాసు, రెడ్డి నర్సింగరావు, ఏక అప్పలరాజు, గొంప నర్సింహనాయుడు, రెడ్డి సన్యాసినాయుడు పాల్గొన్నారు.

సువర్ణ పాలన జగనన్నతోనే సాధ్యం



మంగవరం గ్రామంలో రోడ్డును ప్రారంభించిన ఎమ్మెల్యే గొల్ల బాబూరావు, పార్టీ మండల అధ్యక్షుడు చిక్కాల రామారావు

పాయకరావుపేట : రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సువర్ణ పాలన అందిస్తున్నారని ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. మండలంలో గల నామవరం గ్రామంలో ఏపీకి జగనే ఎందుకు కావాలంటే...అనే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. రైతులకు రైతు భరోసా, మహిళలకు అమ్మ ఒడి, ఆసరా, డ్వాక్రా మహిళలకు సున్నా వడ్డీ, అంగన్‌వాడీల ద్వారా గర్భిణులకు, బాలింతలకు, పిల్లలకు పౌష్టికాహారం, నాడు, నేడు పథకం ద్వారా పాఠశాలలు అభివృద్ధి, జగనన్న గోరుముద్ద ద్వారా విద్యార్థులకు పౌష్టికాహారం వంటి అనేక సంక్షేమ పథకాలను కొనసాగిస్తున్నారన్నారు. లక్షలాది నిరుపేదలకు ఇళ్ల స్థలాలు, ఇళ్లు మంజూరు చేశారన్నారు. అనంతరం గ్రామానికి రూ.26 కోట్లతో చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల వివరాలతో కూడిన డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు.మంగవరం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా మంజూరు చేసిన రూ.10 లక్షల వ్యయం నిర్మించిన రోడ్డును, పెదరాంభద్రపురంలో రూ.40 లక్షలతో నిర్మించిన నూతన గ్రామ సచివాలయ భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావు, జెడ్పీటీసీ లంక సూరిబాబు, ఎంపీపీ ఇసరపు పార్వతీ తాతారావు, పాయకరావుపేట, నామవరం పీఏసీఎస్ అధ్యక్షులు దేవవరపు రాజేష్ ఖన్నా, కె.సుందరీలత, రామాలయం అభివృద్ధి కమిటీ చైర్మన్ లోవరాజు, మంగవరం ఎంపీటీసీ విజయలక్ష్మి రామగోవిందు, పార్టీ మండల మహిళ అధ్యక్షురాలు బొడ్డా శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.



పెదరాంభద్రపురం గ్రామంలో గ్రామ సచివాలయాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే గొల్ల బాబూరావు